### బయట తీసుకోమన్నారు..



నరాలు గుంజుతున్నాయని పాన్‌గల్ నుంచి పెద్ద దవాఖానకు వచ్చినా.. వైద్యులు పరీక్షించి మందులు మాత్రం బయటనే తీసుకోమన్నరు. దవాఖానలో అన్ని ఉంటాయని సర్కారు చెబుతుంది. వీళ్లేమో బయట తెచ్చుకోమంటరు. మాకు అర్థం కావడం లేదు. అంతదూరం నుంచి వస్తే.. కనీసం ఒక్క గోళి కూడా ఇవ్వకుండా అన్నీ బయటే తెచ్చుకోమంటున్నారు.

*- బాలమ్మ, పాన్‌గల్, వనపర్తి జిల్లా*

### ఆయింట్‌మెంట్ లేదంట..



మోకాళ్ల నొప్పులున్నాయని దవాఖానకు వస్తే వైద్యులు చూసినరు.. మందులు బయట తెచ్చుకోమన్నరు. ఇంత పెద్ద దవఖానలో ఆయింట్‌మెంట్ కూడా లేదంట.. షాప్‌లో తీసుకో అన్నరు. డబ్బులు లేవని సర్కారు దవాఖానకు వస్తే ఇలా చేస్తే మేం ఎవరికి చెప్పాలే. ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేదొకటిలా ఉంది.

*- నాగమ్మ, వృద్ధురాలు, గాంధీనగర్, వనపర్తి*



వనపర్తి జిల్లా దవాఖానలో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం బారులుదీరిన ప్రజలు




## ఐదారు నెలలుగా..

కల్వకుర్తి రూరల్, జూలై 15 : కల్వకుర్తి పట్టణంలోని సర్కారు దవాఖానలో ఐదారు నెలలుగా మందులు అరకొరగానే సరఫరా చేస్తున్నారు. మూడు జాతీయ రహదారులకు అతి సమీపంగా ఉన్న ఈ దవాఖానలో వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ మందుల సరఫరా మాత్రం సక్రమంగా లేదు. ప్రతినిత్యం దాదాపుగా నాలుగు వందలకు పైగా రోగులు దవాఖానకు వస్తున్నప్పటికీ వారికి యాంటీ బయోటిక్స్ మందులు లేకపోవడంతో ఇటు రోగులు, అటు వైద్య సిబ్బంది సైతం ఇబ్బంది పడుతున్నారు. దవాఖానకు సాధారణ రోగులు, పాయిజన్ కేసులు, వాంతులు విరేచనాలు, జ్వరాలు, వంటి రోగాలకు వైద్యం కోసం వస్తుండడంతో ఎక్కువగా యాంటీ బయోటిక్స్ అందిస్తూ సేవలందిస్తారు. రోగులకు అందించే వైద్య సేవల నిమిత్తం పరిస్థితుల మేరకు దవాఖాన ఎమర్జెన్సీ బడ్జెట్ ద్వారా అవసరమైన మందులను కొని తెచ్చుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటనుంచి తెప్పించుకోవాల్సి వస్తోందని రోగుల బంధువులు పేర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి కొన్ని రకాల మందులు ఉన్నప్పటికీ యాంటీ బయోటిక్స్ ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు మాత్రం సీడీఎస్ (సెంట్రల్ డ్రగ్స్ సప్లై) మహబూబ్‌నగర్ నుంచి సరఫరా కావడం లేదు. వీటితోపాటు ఓఆర్‌ఎస్, ఆర్ ఎల్ ఫ్లూయిడ్స్, చిన్నపిల్లలకు అందించే సిరప్‌లు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదు. గత ప్రభుత్వం సర్కారు ద వాఖానల అభివృద్ధికి మందుల సరఫరా ఎప్పటికప్పుడు అం దించి మెరుగైన వైద్యాన్ని అందిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం మందులను కూడా సక్రమంగా అందించలేని దుస్థితిలో ఉన్నది. ప్రతినెలా అవసరమైన మందులను పంపించేందుకు సీడీఎస్‌కు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో అందించలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారు.

# మందులన్నీ బయటకే..

- సూదులు, గోలీల కోసం రోగుల అవస్థలు
- బయట ఉన్న మెడికల్ దుకాణాలకు రాస్తున్న వైద్యులు
- బడ్జెట్ విడుదలకు సర్కారు బ్రేకులు

వనపర్తి, జూలై 15 (నమస్తే తెలంగాణ) : సర్కారు వైద్యం కోసం నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలే అధికంగా ఆధారపడతారు. ఈ క్రమంలో ప్రభుత్వ దవాఖానకు వచ్చిన వారికి మందులు.. సూదులు బయట తెచ్చుకోండంటూ చీటీలు (ప్రిస్క్రిప్షన్) రాస్తుండడంతో సర్కారు దవాఖానల్లో నిరుపేదలకు ఆశించిన వైద్యం అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అనారోగ్యంతో వచ్చిన వారికి ఉపశమనం కలుగకపోగా, మరింత ఆర్థికభారం పడుతున్నది. దాదాపు 8నెలలుగా సర్కారు దవాఖానకు మందులు, సూదుల కోసం రావాల్సిన నిధులన్నీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రస్తుత సీజన్‌లో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి.



అందుబాటులో ఉన్న మందులను తీసుకుంటున్న రోగులు

**ప్రతి రోజూ 800 మంది పేషెంట్లు..**

జిల్లా దవాఖానకు అన్ని వార్డులకు సంబంధించి దాదాపు 500 నుంచి 800 మంది వరకు పేషెంట్లు వస్తున్నారు. 450 పడకలతో నడుస్తున్న ఈ దవాఖానకు రోగుల తాకిడి తీవ్రంగానే ఉన్నది. చిన్నారులు, పెద్దలతోపాటు ఆర్థోపెడిక్, డెంటిస్ట్, ఈఎన్‌టీ తదితర విభాగాల వారీగా జిల్లాలోని నలుమూలల నుంచి పేషెంట్లు వస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ఉండడంతో మరింత మంది పెరుగుతున్నారు. ప్రజలు సాధారణ జ్వరాలతోపాటు మలేరియా, డెంగీ తదితర రోగాల బారిన పడుతున్నారు. వర్షాలు మరింత పెరిగితే.. రోగాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నది.

**పెండింగ్‌లో నిధులు..**

జిల్లా దవాఖానకు దాదాపు నాలుగు క్వార్టర్లకు సంబంధించిన బడ్జెట్ రాలేదు. మందుల సరఫరాలోనూ కోత విధిస్తూ ఎన్ని దఫాలు అడిగినా.. నోస్టాక్ అన్నట్లుగా కొన్ని మందుల పరిస్థితి ఉన్నది. దాదాపు ఆరు నెలలుగా ప్రాధాన్యతగల మందులకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. గత మార్చిలో డ్రగ్స్ కోసం ఒక క్వార్టర్‌కు సంబంధించి రూ.12.50 లక్షలు మాత్రమే వచ్చాయి. ఇంకా మూడు క్వార్టర్లకు పైగా నిధులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో మందులు కొనుగోలు చేయలేక, రోగులను బయటకు పంపిస్తున్నారు. ఇదిలా ఉంటే సర్జికల్ మందుల పరిస్థితి మరింత ఘోరంగా ఉన్నది. విభాగాల వారీగా కేటాయించిన ప్రకారం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉన్నది.

**మందులు అందుబాటులో ఉంచుతాం**



దవాఖానలో అధిక శాతం మందులు, సూదులు ఉన్నాయి. కొన్ని మాత్రమే కొంత కాలం నుంచి రావడం లేదు. వాటిని తెప్పించే ప్రయత్నం చేస్తాం. రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని అందుబాటులో ఉంచుతాం. కొన్ని సందర్భాల్లో లేకుంటే ప్రత్యామ్నాయ మందులను ఇస్తున్నాం. ప్రతి క్వార్టర్ బడ్జెట్ విడుదల, పెండింగ్‌లకు సంబంధించి ఆ బాధ్యతలను నిర్వహించే సూపరింటెండెంట్ సెలవులో ఉన్నారు.

*- డాక్టర్ రవిశంకర్, ఆర్‌ఎంవో, జిల్లా దవాఖాన, వనపర్తి*

### మూడు నెలల సంది తిరుగుతున్న..

అయ్యా పట్టించుకోమ్మని మీరైనా చెప్పండి. మూడు నెలల సంది తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కట్టు కడుతున్నారు.. పంపిస్తున్నారు. మంచి మందులు ఇయ్యమని అడిగితే కసురుకుంటున్నారు. ఆఖరికి ఈ రోజు నడవలేకపోతున్నా. తోపుడు కుర్చీ ఇయ్యమంటే ఇయ్యలే. గా మూలన ఉంటే మేమే తెచ్చుకుని వస్తున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

*- వెంకట్రాములు, రోగి, అమరవాయి, జోగుళాంబ గద్వాల జిల్లా*





వనపర్తి జిల్లా దవాఖానలో చికిత్స కోసం వచ్చిన రోగిని స్వయంగా స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

నమస్తే తెలంగాణ విజిట్ NAMASTHE VISIT

‘మాకేం పనిలేదా..? ఆడ చక్రాల కుర్చీ ఉంది సూడు.. తీసుకుపోయి పేషెంట్‌ను తోలుకొనిరా..’ ‘ఇక్కడ రోగం నయం కాదు.. సక్కగా కర్నూలుకు పో..’ ‘మా దగ్గర మందులు లేవు.. ఎక్కడి నుంచి తెమ్మంటావు.. మంచి మందులు కావాలంటే బయట తెచ్చుకో రాసిస్త..’ ఇలా ప్రతిరోజూ ప్రభుత్వ దవాఖానల్లో రోగులతో వైద్యులు, సిబ్బంది చెబుతున్న మాటలు.. ప్రభుత్వం మారింది.. మేము కూడా మారుతాం అనుకున్నారేమో.. మా తీరింతే.. అనేలా వైద్యాధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే ప్రభుత్వం, ఉన్నతాధికారుల అజామాయిషీ ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతున్నది.

# నో మెడిసిన్

## సర్కారు వైద్యం.. దైవాదీనం

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రోగులు
- దవాఖానల్లో తీవ్ర మందుల కొరత
- సరఫరాలో తీవ్ర జాప్యం
- సీజనల్ వ్యాధులొస్తేనే హడావుడి
- అప్రమత్తం కాని వైద్య, ఆరోగ్య శాఖ
- బడ్జెట్ విడుదల చేయని ప్రభుత్వం

***సర్కారు వైద్యం దైవాదీనంగా తయారైంది. ఉమ్మడి జిల్లాలో రోగాలు ఫుల్‌గా ఉంటే వైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నిత్యం రోగుల సంఖ్య పెరుగుతూ ఉన్నది. కానీ మెడిసిన్ సరఫరాకు ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతో పేషెంట్లకు ఇక్కట్లు తప్పడం లేదు. పలు దవాఖానల్లోని వైద్యులు సూదులు, గోలీలకు బయటి మెడికల్ షాపులకు రెఫర్ చేస్తున్నారు. అరకొర వసతులతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ముందస్తుగా అలర్ట్ కాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, రోగాలొస్తేనే హడావుడి కనిపిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.***

*- మహబూబ్‌నగర్, జూలై 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

ఉమ్మడి జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి.. ఎడతెరిపిలేని వానలతో గ్రామాల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు చలిగాలులు విపరీతంగా వీస్తున్నాయి. దోమల బెడద కూడా ఎక్కువైంది. గ్రామాల్లో సర్పంచుల పాలన లేకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఫలితంగా జనం రోగాల బారిన పడుతున్నారు. ఇదివరకే సీజనల్ వ్యాధుల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని జిల్లా దవాఖానలు, ఏరియా ఆసుపత్రులు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. అయితే వైద్య ఆరోగ్యశాఖ అ ప్రమత్తమై జనాలకు ట్రీట్మెంట్ ఇస్తున్న వారికి సరైన మం దులు ఇవ్వడంలో మాత్రం విఫలమవుతున్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ సర్కారు కొత్తగా వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సర్కారు దవాఖానల్లో మందులకు నయా పైసా విడుదల చేయలేదు. ఫలితంగా రోగులకు ట్రీట్మెంట్ ఇస్తూ



గద్వాల దవాఖానలో కిక్కిరిసిన రోగులు

గోలీలకు బయటకు రాస్తున్న దుస్థితి ఏర్పడింది. దీంతో జనం డబ్బులు పెట్టి మందులు కొనలేక సతమతమవుతున్నారు. మరి కొన్నిచోట్ల ఉన్న మందులను కొన్నికొన్ని ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఈ పరిస్థితి ఉందంటే మిగతా జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సర్కారు ప్రతి ఏటా ఇచ్చే మందులను సరఫరా చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రతి జిల్లా నుంచి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు సంవత్సరానికి సరిపడా వివిధ రకాల మందులను ఇండెంట్ పెడతారు. జిల్లా డ్రగ్స్ యూనిట్ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లా అంతటా సరఫరా అవుతుంది. కొన్ని జిల్లాల్లో ప్రత్యేక మందుల సరఫరా కేంద్రాలు ఉన్నాయి. కాగా రోగులకు సరిపడా మందులు లేక డాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. పైనుంచి రావడం లేదని తామేం చేయలేమని అంటున్నారు. ఈ విషయమై జిల్లా వైద్యశాఖ అధికారులకు సంప్రదించడానికి ‘నమస్తే తెలంగాణ’ ప్రతినిధి ప్రయత్నించగా మంత్రుల పర్యటనలో ఉన్నామని చెప్పడం కోసం మెరుపు. ఇప్పటికైనా సర్కారు మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని దవాఖానలకు మందులను సరఫరా చేసి రోగులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### చూడకుండానే కర్నూల్‌కు..

నాకు కాళ్లు, చేతులు పనిచేస్తలేవు.. డాక్టర్‌కు చూపిద్దామని వచ్చినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓ డాక్టర్ వచ్చి ఏమీ చూడకుండానే కర్నూల్‌కు పొమ్మని చీటీ మీద రాసిచ్చి పోయిండు. కనీసం నొప్పి తగ్గనీకైనా మందులు ఇయ్యండని అడిగినా పట్టించుకుంట లేరు.

*- అమరేశ్, రోగి, పెంచికలపాడు, జోగుళాంబ గద్వాల జిల్లా*



## అరకొర వసతులు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గద్వాలటౌన్, జూలై 15 : గద్వాల జిల్లా దవాఖానలో ప్రతిరోజూ 600కు పైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. అలాగే దవాఖానలో దాదాపు 280మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు. తమ జబ్బులు నయం చేసుకునేందుకు వచ్చే రోగులకు సిబ్బంది చీదరింపులతోపాటు సరైన మందులు లేకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రైవేట్ వైద్యశాలలో చూపించుకోలేక, సర్కారు దవాఖానలో సరైన మందులు దొరక్కా నానా అవస్థలు పడాల్సి వస్తుంది. మంచి మందులు కావాలంటే బయటకి రాసిస్తాం తెచ్చుకోండని వైద్య సిబ్బంది చెబుతున్నారని రోగులు వాపోతున్నారు. ఆ డబ్బులే ఉంటే గవర్నమెంట్‌కు దవాఖానకు ఎందుకొస్తామన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారితే మంచి వైద్యం లభిస్తుందనుకుంటే ‘కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడినట్లైంది’ అని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా సీజనల్ వ్యాధులైన డయేరియా, ఇతర అంటు రోగాలకు సంబంధించిన మందుల కొరత ఏమి లేదని, అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.



దవాఖాన పక్కనే ఉన్న ప్రైవేట్ దుకాణంలో మందులు కొనుగోలు చేస్తున్న రోగులు

## కొరత తీరేనా?

- అసంపూర్తిగా మెడిసిన్ డ్రగ్ స్టోర్
- మహబూబ్‌నగర్ నుంచే మందుల పంపిణీ

నాగర్‌కర్నూల్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : సీజనల్ రోగాలొస్తే వైద్యశాఖ హడావుడి చేస్తూందే తప్పా.. ముందస్తు చర్యలకు సిద్ధమవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నల్లమల ప్రాంతమైన నాగర్‌కర్నూల్ జిల్లాలో వైద్యశాఖ తీరుపై గతంలోనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచడంలో తీసుకుంటున్న చర్యలు ప్రశ్నార్థకంగా మిగులుతున్నాయి.

మందుల కొరతను తీర్చేందుకు ముందస్తు చర్యలు కనిపించడం లేదు. వానకాలం, ఎండాకాలంలో ప్రధానంగా సీజనల్ రోగాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. ఎండాకాలంలో వడదెబ్బ ప్రభావం చూపిస్తే వానకాలంలో డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్, పాము కాట్లు, కుక్కకాట్లు లాంటి రోగాలు ఇబ్బందులు కలిగిస్తుంటాయి. ముఖ్యంగా నల్లమల ప్రాంతమైన నాగర్‌కర్నూల్‌లోని కొల్లాపూర్, అచ్చంపేటలోని చెంచు పెంటలు, అటవీ పరిసర గ్రామాల్లో దోమ సంక్రమిత వ్యాధుల ప్రభావం ఎక్కువ. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అనారోగ్యానికి గురైతే దవాఖానలకు వెళ్లడం వరకే కాలయాపన జరుగుతుంటుంది. ఇక సమీప దవాఖానలకు వెళ్లేసరికి సంబంధిత మాత్రలు లేకపోవడం పరిపాటిగా మారింది. జిల్లాలోని పలు సంఘటనలు వైద్యశాఖ తీరుపై విమర్శలకు దారి తీసింది. ఇదిలా ఉంటే విశాలమైన జిల్లాలో మందుల కొరతను తీర్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3.60కోట్లతో సెంట్రల్ మెడికల్ స్టోర్స్‌ను మంజూరు చేసింది. బిజినేపల్లి మండలం పాలెం పీహెచ్‌సీ ఆవరణలో గతేడాది జూలై 30వ తేదీన పనులకు శంకుస్థాపన చేశారు. ఇది జరిగి ఏడాది కావస్తున్నా పనులు పూర్తి కాలేదు. దీంతో మందులు మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వరకు కాలయాపన జరుగుతోంది. హైదరాబాద్ నుంచి మందులు తీసుకొచ్చేందుకు ఒక వాహనం, అక్కడి నుంచి ఉమ్మడి జిల్లాకు పంపిణీ చేసేందుకు ఒక్క వాహనమే ఉంది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో మందుల రవాణాలో జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించాలంటే డ్రగ్ స్టోర్ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఇక డెంగీ కిట్ల కొరత కూడా ఉంది. కిట్లు ముందస్తుగా పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచకపోతే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నది. వైద్యశాఖ అధికారుల లెక్కల్లో అన్ని రకాల మందులు ఉన్నాయని పేర్కొంటున్నా.. వాస్తవంగా భిన్నంగా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లా దవాఖానలో పాము, కుక్కకాట్ల మందులు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ గోళీలు రాంటడిన్ సప్లై అవుతున్నాయని, డెంగీ కిట్లు సరిపోను ఉన్నాయని సూపరింటెండెంట్ రఘు తెలిపారు. అత్యవసరమైన మందులను ఇండెంట్ పెట్టించి తెప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



అసంపూర్తిగా సెంట్రల్ మెడికల్ స్టోర్


# రైతుల ప్రయోజనం కోసం..

- నవాబ్‌పేటకు 133/11 సబ్‌స్టేషన్ మంజూరు
- 30 పడకల దవాఖాన, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి
- రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవాబ్‌పేట, జూలై 15 : రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నవాబ్‌పేటకు 133/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయిస్తానని రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం నుంచి తిర్మలాపూర్ వరకు రూ.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు విస్తరణ, నవాబ్‌పేటలో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్‌స్టేషన్ మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు సంబంధిత అధికారులు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే డిగ్రీ కళాశాల, 30 పడకల దవాఖాన, మార్కెట్ యార్డు విస్తరణ, కారుకొండ, కొల్లూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంగ్లా రవి, జహీర్‌అక్తర్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, తుల్సీరాం నాయక్, నవాజ్‌రెడ్డి, బీజేపీ నేతలు బాలత్రిపుర సుందరి, మధుసూదన్‌రెడ్డి, రాజు, శ్రీను, గణేశ్, రామకృష్ణ, పాల్గొన్నారు.

**పాలమూరు జిల్లా అభివృద్ధికి కృషి..**

మిడ్జిల్/బాలానగర్, జూలై 15 : పాలమూరు జిల్లా అభివృద్ధికి కృషి చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తామని మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. రెడ్డిగూడ కమాన్ నుంచి మిడ్జిల్ వరకు రూ.37కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పనులపై సమీక్ష నిర్వహించి, తర్వగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా బాలానగర్ చౌరస్తా నుంచి జడ్చర్ల మండలం గంగాపూర్ వరకు రూ.56 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలతో కలిసి మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజాపూర్ తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ విజయేందిరబోయి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర్, నాయకులు శివకుమార్, అల్వాల్‌రెడ్డి, రబ్బాని, బాల్‌రెడ్డి, వెంకటయ్య, గౌస్, ప్రశాంత్‌రెడ్డి, బాలయ్య, సత్యంగుప్తా, వెంకటేశ్‌గౌడ్, బంగారు, శివ, సత్యంగౌడ్, నాగరాజు, మల్లయ్య, పర్వతాలు, శంకర్, నిరంజన్, అశోక్ తదితరులు ఉన్నారు.



నవాబ్‌పేటలో రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి